సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం | 27 | నవంబర్ | 2024



## పుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడుకోవాలి

అంతర్వేది పుణ్యక్షేత్ర పవిత్రతను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని శృంగేరి పీఠాధిపతి విధు శేఖర భారతీ మహాస్వామి భక్తులకు హితవు పలికారు.


8 లో



## ధాన్యం ఇలా భద్రపరుచుకోవాలి

ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో ధాన్యాన్ని ఎలా భద్రపరచుకోవాలో రైతులకు కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సూచనలు చేశారు.

## డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు, మధ్య డెల్టాలకు చెరో 600, పశ్చిమ డెల్టాకు 2,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలను విడుదల చేశారు. సముద్రంలోకి 17,382 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### జింకల ఆచూకీపై అటవీ శాఖ అధికారుల ఆరా



ఊబలంకలో జింకల ఆచూకీపై ఆరా తీస్తున్న అటవీ శాఖ అధికారులు

రావులపాలెం: స్థానిక గౌతమీ గోదావరి నది పరివాహక గ్రామాల్లో లంక ప్రాంతాల్లో జింకల సంచారంపై అటవీ శాఖ అధికారులు మంగళవారం గ్రామస్థాయిలో ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు జింకల ఆచూకీ కోసం అధికారులు స్థానికంగా లంకల్లో తిరిగారు. రైతులు, మత్స్యకారులు, ఆయా గ్రామాల సర్పంచులతో మాట్లాడి జింకల సంచారంపై సమాచారం సేకరించారు. దీనిలో భాగంగా రావులపాలెం, ఊబలంక కొమరాజులంక లంక ప్రాంతాల్లో జింకల ఆచూకీ కోసం స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా జింకలు కనిపిస్తే తమకు తెలియజేయాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.రాంబాబు సూచించారు.

### కార్మిక సంఘాల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

అమలాపురం రూరల్: కలెక్టరేట్ వద్ద మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్రామాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా విధానాల్లో మార్పు లేదన్నారు. ఎన్డీఏలో భాగస్వాములుగా ఉన్న తెలుగుదేశం, జనసేన రాష్ట్రంలో అదే విధానాలను అమలుచేస్తున్నాయని ఎద్దేవా చేశారు. గత 10 ఏళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.19.28 లక్షల కోట్ల రుణమాఫీ, పన్నురాయితీ, ప్రోత్సాహాల పేరుతో కట్టబెట్టిందని అన్నారు. కార్మికులకు రూ.26వేల కనీస వేతనాన్ని ఇవ్వడంలేదని ఏఐటీయూసీ పూర్వ జిల్లా అధ్యక్షుడు కే.సత్తిబాబు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయు జిల్లా ట్రెజరర్ కే కృష్ణవేణి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు ఆశా వర్కర్ల జిల్లా కార్యదర్శి మలకా సుభాషిణి మాట్లాడుతూ కనీస వేతనం పెంచలేదని, ధరలు రెట్టింపు పెరిగాయని అన్నారు.



కలెక్టరేట్‌కు వస్తున్న ఆశా వర్కర్లను గేట్లు బంద్ చేసి అడ్డుకుంటున్న పోలీసులు



జీతం బకాయిలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల పారిశుధ్య కార్మికులు, వాచ్‌మన్‌లు

# సర్కారుపై ధర్నాకోలా

- ఆందోళనల బాటపట్టిన వివిధ వర్గాల జనం
- కలెక్టరేట్ వద్ద రోజూ ఏదో ఒక వర్గం ధర్నాలు
- చిరుద్యోగులు.. అన్నదాతలతో కూటమి ప్రభుత్వం ఆటలు
- ధాన్యం డబ్బు కోసం పోరాడుతున్న రైతులు
- రోడ్డెక్కిన ఆశావర్కర్లు, 108 సిబ్బంది, కార్మికులు, మద్యం దుకాణాల ఉద్యోగులు



రాజోలు బీసీ సంక్షేమ శాఖ వసతిగృహం వద్ద విద్యార్థుల ఆకలి కేకలు



విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయవద్దని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాలు

సాక్షి, అమలాపురం: అడ్డగోలు హామీలతో ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజలకు భ్రమలు వీడుతున్నాయి. కాంట్రాక్ట్.. ఔట్ సోర్సింగ్.. ప్రభుత్వ శాఖలోని చిరుద్యోగులు.. నిరుద్యోగులు.. మహిళలు.. రైతులు ఇలా అన్నివర్గాల వారు ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. ఇచ్చేది అరకొర జీతాలు కాగా వాటిని కూడా నెలల తరబడి ఇవ్వకపోవడం.. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై వారు కదం తొక్కుతున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఇంప్లిమెంట్ ఏజెన్సీలకు.. వసతి గృహాలకు చార్జీలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆకలి కేకలు పెడుతున్నారు. వెరసి కోనసీమ జిల్లా కలెక్టరేట్ రోజూ ఏదో ఒక వర్గం ధర్నాలతో దద్దరిల్లుతోంది. జిల్లాలో పలుచోట్ల సమస్యల పరిష్కారం కోసం పలువర్గాల వారు ఆందోళనలు చేయడం సాధారణ విషయంగా మారింది.

### జూలై 31: అన్నదాతల ఆందోళన

తీర ప్రాంత మండలాల్లో ముంపు సమస్య పరిష్కరించాలని జూలై 31వ తేదీన కోనసీమ రైతు పరిరక్షణ సమితి సభ్యులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పంట భూముల ఆక్రమణలు, మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో పాటు పరిరక్షణ సమితి అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం (టీడీపీ), కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు (జనసేన)లతోపాటు ఆ పార్టీల క్రియాశీలక సభ్యులు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

### రెగ్యులరైజ్ చేయాలని..

సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖలు, పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, నాన్ పర్మినెంట్ ఉద్యోగులు తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 30న ఆందోళన నిర్వహించారు. పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చే అన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్, ఆశా వర్కర్స్, జిల్లా శానిటేషన్ వర్కర్స్, మిడ్ డే మీల్, పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్‌లు పాల్గొన్నాయి.

### అక్టోబర్ 2: సమగ్ర శిక్ష ఉద్యోగులు

బకాయి వేతనాలు చెల్లించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష జేఏసీ పిలుపు మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్లో జీతాల కోసం ఉద్యోగులు గర్జించారు. తమ గోడును గాంధీ విగ్రహం వద్ద వినిపించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద వినతి పత్రం ఉంచారు. ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మాత్రం మారలేదని, తమను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు.

### అక్టోబర్ 3: విశాఖ ఉక్కుపై..

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేయకూడదని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, కౌలు రైతు సంఘాల ఆధ్వరంలో నిరసన దీక్ష చేశారు. పలువురు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ 32 మంది ప్రాణ త్యాగాలతో, 67 మంది ఎంపీల రాజీనామాతో, 30 గ్రామాల రైతుల 32వేల ఎకరాల భూముల త్యాగంతో సాధించుకున్నామని గుర్తు చేసుకున్నారు.

### నవంబర్ 4: మద్యం షాపు వద్దని..

అమలాపురం రూరల్ మండలం కామనగరువు బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న మద్యం షాపు తొలగించాలని ఆ గ్రామ వాసులు నవంబర్ 4న కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. తక్షణం మద్యం షాపు తొలగించాలని డిమాండ్ చేశారు.

### నవంబర్ 10: ఆకలి తీర్చాలంటూ..

▶▶ రాజోలు బీసీ బాలుర వసతి గృహం వద్ద "వార్డెన్ రావాలి... ఆకలి తీర్చాలి" అంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ హాస్టల్‌లో 40 మంది వరకు ఉండగా వసతులు లేవు. రోజూ వారి పెట్టే ఆహారం బిల్లులు రావడం లేదని మజ్జిగ అన్నం పెడుతుండడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఐదు బాత్ రూమ్‌లు ఉండగా రెండే పనిచేస్తున్నాయని వారు ఆందోళన చేపట్టారు.

▶▶ 104 ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవ చేస్తున్న 104 సర్వీసులను ప్రభుత్వం గతంలో మాదిరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

### నవంబర్ 11: హామీల అమలుకు..

ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం గ్రామాన్ని అభివృద్ధి చేయకుండా వేదాంత ఆయిల్ కంపెనీ నిర్లక్ష్యం వహిస్తోందని, స్థానిక నిరుద్యోగులకు ఉపాధి చూపడం లేదని ఆ గ్రామానికి చెందినవారు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఆందోళన చేసినప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రూ.వేల కోట్ల చమురు నిక్షేపాలు తరలించుకుపోతోందని ఆరోపించారు.

### నవంబర్ 14: ధరలు తగ్గించాలని..

కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంటనూనె ధరలు ఆకాశాన్నంటాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల అదుపునకు చర్యలు తీసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరకులను సరసమైన ధరలకు అందించాలన్నారు. దీంతోపాటు డీఎస్సీ వాయిదా వేశారని, గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించలేదని, గ్రూప్–1, గ్రూప్–2 నియామకాలు అగమ్యగోచరంగా మారాయని వారు ఆందోళన చేపట్టారు.

### నవంబర్ 16: పని వత్తిడి తగ్గాలని..

▶▶ మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను మెయిన్ కార్యకర్తలుగా గుర్తించాలని కోరుతూ ధర్నాకు దిగారు. దాదాపు 13 సంవత్సరాలుగా మినీ కార్యకర్తలుగా పనిచేస్తున్న వారిపై పలు రకాల యాప్‌లతో తీవ్రమైన పని వత్తిడి పెంచారని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు.

▶▶ ఏపీ వెలుగు వీఓఏ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఏమి తింటారు, ఎలా బతుకుతారు అనే ఆలోచన లేకుండా పని చేయించుకోవడం సిగ్గుచేటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### నవంబర్ 18: ఆశాల ఆందోళన

▶▶ కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్లు తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన ప్రదర్శనకు దిగారు. తమ పనివేళలను పెంచుతూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పీహెచ్‌సీలలో ఉండాలని విధించిన నిబంధన ఎత్తివేయాలని, జీతం పెంచాలని డిమాండ్ చేశారు. వారు శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తుండగా కలెక్టరేట్ గేట్లు మూసి పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

▶▶ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పారిశుధ్య కార్మికులు, వాచ్‌మన్‌లు ఆందోళన చేశారు. ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.

▶▶ 2023 సంవత్సరంలో డిసెంబర్ 5 తేదీన మిచాంగ్ తుపాను వల్ల పంటలు నష్టపోయిన రైతులకు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిహారం అందించింది. సాంకేతిక కారణాల వల్ల అమలాపురం మండలంలో 1,961 మంది రైతులకు రూ.2.28 కోట్ల పంట నష్ట పరిహారం రాలేదని రైతులు ఆందోళనకు దిగారు.

### మొర ఆలకించని కూటమి ప్రభుత్వం

వివిధ వర్గాల వారు ఆందోళనకు, ధర్నాలకు దిగినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ఆయా వర్గాల వారు నిరసన గళం వినిపిస్తున్నా ప్రభుత్వం నుంచి జీతాలు చెల్లించడం కాని, ఇంప్లిమెంట్ ఏజెన్సీలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వడం కాని చేయడం లేదు. స్థానికంగా చేస్తున్న ఆందోళనలకు సైతం పరిష్కారం లభించడం లేదు. మురుగునీటి కాలువల్లో పూడిక తొలగింపుపై కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మొగల వద్ద డ్రెడ్జింగ్ చేసి ముంపునీరు దిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు.

# బాధ్యతా రహితంగా మాట్లాడకండి

**మంత్రి సుభాష్ వ్యాఖ్యలపై మండిపడ్డ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్**



రామచంద్రపురం: ఆక్వా రైతులను బహిరంగంగా ముడుపులు అడిగి సిగ్గు లేకుండా పదే పదే అవినీతి గురించి బాధ్యతా రహితంగా మాట్లాడటం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌కే చెల్లిందని, వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ దుయ్యబట్టారు. తనకు లాయర్ నోటీసులు ఇచ్చినా ఇప్పటి వరకు స్పందించలేదని మంత్రి వాసంశెట్టి సుభాష్ చేసిన వ్యాఖ్యలపై సూర్యప్రకాశ్ మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మండిపడ్డారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల అఫిడవిట్‌లో మంత్రి సుభాష్ పేర్కొన్న అంశాన్ని తాను మీడియా సమావేశంలో ప్రస్తావించగా తనకు ఈ నెల 8న లాయర్‌తో మంత్రి సుభాష్ నోటీసులు పంపించారన్నారు. దీనికి తాను ఈ నెల 13 తేదీన తిరిగి సమాధానం ఇచ్చానని చెప్పారు. కానీ తాను నోటీసులకు స్పందించలేదని మంత్రి సుభాష్ అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గుచేటని సూర్యప్రకాశ్ విమర్శించారు. గడచిన ఐదు నెలల పాలనలో మీ సొంత కార్యకర్తలను కూడా గుర్తు పట్టలేని పరిస్థితికి దిగజారిపోవటం మీకే చెల్లిందన్నారు. నిరాధార ఆరోపణలు చేయటం తప్ప నియోజకవర్గ సమస్యలపై మంత్రి అవగాహన పెంచుకోలేదన్నారు. కృష్ణాజిల్లాలో జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్‌కు తహసీల్దార్‌కు, జాయింట్ కలెక్టర్‌కు, డిప్యూటీ తహసీల్దార్‌కు తేడా తెలియకుండా మాట్లాడిన ఘనుడు ఈ మంత్రి అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యేలు, మంత్రులు ఈయనగారి అవగాహన లేమిని అసెంబ్లీలో ఎండగట్టిన విషయం ప్రజలందరూ గమనించారని అన్నారు. వైఎస్సార్ సీపీది అవినీతి ప్రభుత్వం అని పదే పదే చెబుతున్న మంత్రి సుభాష్.. నియోజకవర్గంలోని ఆక్వా రైతులు నాకు ఫార్మాలిటీస్ ఇవ్వాలని బహిరంగంగానే అడిగిన సంగతిని ప్రజలందరూ గమనించారన్నారు. రాజకీయాల్లో ఆరోపణలు ప్రత్యారోపణలు సహజమని, వాటిని ఖండించుకోవాల్సిన బాధ్యత నాపై ఎంతుందో.. మీపైనా కూడా అంతే ఉందని మంత్రి సుభాష్‌కు సూర్యప్రకాశ్ సూచించారు. అలాకాకుండా మీరు నోటీసులిస్తే వాటికి దీటైన సమాధానం వైఎస్సార్ సీపీ ఇస్తుందని, మీ నోటీసులకు భయపడేది లేదని చెప్పారు. ఎప్పటికప్పుడు మీ అవినీతిని ప్రజల మధ్యలో ఉండి ఎండగడతామని ప్రజల పక్షాన నిలుస్తామని సూర్యప్రకాశ్ బదులిచ్చారు.

# ఐఆర్‌డీఏ విధానాలు ఎల్ఐసీ మనుగడకు గొడ్డలి పెట్టు




నూతనంగా ఎన్నికైన ఏఓఐ కార్యవర్గంతో సౌత్ సెంట్రల్ జోన్ కార్యదర్శి నరసింహారావు తదితరులు

**కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేందుకు కేంద్రం పన్నాగం**

అమలాపురం రూరల్: బీమా రంగంలో అక్టోబర్ 30న ఐఆర్‌డీఏ తీసుకొచ్చిన నూతన విధానాలు ఎల్ఐసీ మనుగడకు గొడ్డలి పెట్టని సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి పీఎల్ నరసింహారావు అన్నారు. ఆర్థిక రంగంలో అగ్రస్థానంలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా కేంద్రంలో మోదీ ప్రభుత్వం, ఐఆర్‌డీఏ యోచిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా మేలుకోకపోతే బీఎస్ఎన్ఎల్, స్టీలుప్లాంట్‌ల పరిస్థితి ఎల్ఐసీకి ఎదురవ్వుతుందన్నారు. కామనగరువులోని మేధా గార్డెన్‌లో సానబోయిన వీరభద్రరావు అధ్యక్షతన ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా మొదటి సమావేశం నిర్వహించారు. ఏపీ స్టేట్ జనరల్ సెక్రటరీ రవికిషోర్, రాజమండ్రి ఏఓఐ డివిజనల్ అధ్యక్షుడు వై.విశ్వేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సౌత్‌సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ ఐఆర్‌డీఏ విధానాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 10న రాజమండ్రిలోని డివిజనల్ కార్యాలయం వద్ద మహా ధర్నా చేపడతామని, ఫిబ్రవరి 11న చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఇటీవల కొత్తగా వచ్చిన నిబంధనలతో సమ్ అస్యూర్డ్ పెంచడం, ఏజెంట్లకు కమీషన్ తగ్గించడంపై పోరాటం చేయాలన్నారు. అనంతరం ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. అధ్యక్షుడిగా సానబోయిన వీరభద్రరావు, కార్యదర్శిగా వినాయకరావు, కోశాధికారిగా దొమ్మేటి శివస్వామి, ఐదుగురు ఉపాధ్యక్షులు, 33 మందితో కూడిన నూతన కమిటీని ప్రకటించారు. రాజోలు ఏఓఐ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, కోశాధికారి రామకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ వీరభద్రరావు, డీఓలు నాట్రు సుబ్రహ్మణ్యం, రామారావు, శ్రీకాంత్, అధిక సంఖ్యలో ఏజెంట్లు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి ప్రాథమిక హక్కులే పునాది

**కలెక్టర్ మహేష్ కుమార్**




కలెక్టరేట్‌లో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి అధికారులు

అమలాపురం రూరల్: ప్రజాస్వామ్యానికి భారత రాజ్యాంగ ప్రాథమిక హక్కులే పునాది అని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని సంవిధాన్ దివస్ పేరిట కలెక్టరేట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 1949 నవంబర్ 26న అప్పటి పార్లమెంట్ రాజ్యాంగాన్ని ఆమోదించిందన్నారు. జాయింట్ కలెక్టర్ నిషాంతి మాట్లాడుతూ మన రాజ్యాంగం ప్రపంచానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞను కలెక్టరేట్ ఉద్యోగులతో డీఆర్ఓ వి.మదనమోహనరావు చేయించారు. కలెక్టరేట్ ఏవో కాశీ విశ్వేశ్వర రావు, మురళీకృష్ణ, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ పాల్గొన్నారు.

### బోటు రేసు నిర్వహణకు సన్నాహాలు

ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల ఎగువ భాగంలో బోటు రేసు నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక కమిటీ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లాలో పాసర్లపూడి, ఆదుర్రు గ్రామాలలో బోటింగ్ టెర్మినల్స్ ఏర్పాటు, కోటిపల్లిలో టూరిజం రిసార్ట్స్ ఆపరేషన్ మేనేజ్‌మెంట్ నిర్వహణ పనులు, ఆత్రేయపురం లొల్ల లాకుల వద్ద పెడల్ బోట్ రేస్ నిర్వహణ అంశాల పురోగతిపై కమిటీ ఆధ్వర్యంలో సమీక్షించారు.

జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి వెంకటాచలం, డివిజనల్ మేనేజర్ పవన్‌కుమార్, మేనేజర్ గంగ బాబు, జలవనరుల శాఖ డీఈలు బి. శ్రీనివాసరావు, కేవీఎస్ సుబ్బారావు, దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

### రెవెన్యూ ఉద్యోగులు పనితీరును మెరుగుపరచుకోవాలి

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వివిధ విభాగాల రెవెన్యూ ఉద్యోగులు పనితీరును మెరుగుపరచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగులతో జేసీ అధ్యక్షతన సెక్షన్ల పని తీరుపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ సెక్షన్ అధికారులు ప్రతి ఒక్కరికి రోజు వారీగా విధులు కేటాయిస్తూ సాయంత్రం వాటిని ఏ మేరకు పూర్తి చేసింది నివేదిక కోరాలని ఆదేశించారు. ఇకపై ప్రతి 15 రోజులకు సిబ్బందితో సమావేశం నిర్వహించి పనుల నిర్వహణ తీరును సమీక్షిస్తానని ఆమె స్పష్టం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి మదన్ మోహన్‌రావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి కె.కాశీ విశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్లు మురళీకృష్ణ, బోసుబాబు, వికాస జిల్లా మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

### యాప్ ఆవిష్కరణ

దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ అనే ఆయుష్ మొబైల్ యాప్‌ను కలెక్టర్ అమలాపురం కలెక్టరేట్‌లో ప్రారంభించారు. ఈ యాప్‌లో ప్రతి పౌరుని శారీరక, మానసిక ఆరోగ్య సమాచారం పొందుపరుస్తారన్నారు. ఆయుర్వేద వైద్యులు కె.విజయకుమారి, బి.శ్యామ్ సుందరరావు పాల్గొన్నారు.

### మెగా సమావేశాలను విజయవంతం చేయాలి

డిసెంబర్ 7వ తేదీన జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న తల్లిదండ్రులు, టీచర్ల మెగా సమావేశాలను విజయవంతం చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గోదావరి భవన్‌లో తల్లిదండ్రులు, టీచర్లు పాఠశాలల వారీగా నిర్వహించనున్న మెగా సమావేశాల నిర్వహణ విధి విధానాలపై సమీక్షించారు.

## 108 సేవలు నిలిచిపోకుండా ఏర్పాట్లు

108 ఉచిత అత్యవసర సేవలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, 108 సమన్వయ అధికారులతో సమావేశం నిర్వహించారు. అరవిందో సంస్థ వాహన డ్రైవర్లు ధర్నాకు దిగిన మూలంగా అత్యవసర వైద్య సేవలు నిలిచిపోకుండా తాత్కాలిక ప్రాతిపదికన నాలుగు చక్రాల లైట్ మోటార్ వాహన లైసెన్స్ కలిగిన వారిని జిల్లా రవాణా అధికారి సమన్వయంతో నియమిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. 108 అత్యవసర వైద్య సేవల జిల్లా కోఆర్డినేటర్ అజయ్, వైద్యశాల సమన్వయ అధికారి కార్తీక్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, రవాణా శాఖ అధికారి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సపక్ తక్రా పోటీల్లో ఇద్దరికి కాంస్య పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–14 సపక్ తక్రా క్రీడా పోటీల్లో స్థానిక కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అప్పారి పవన్, పేరూరి రోహిత్ సాయి ఫణీంద్రలు కాంస్య పతకాలు సాధించారు. వీరు ఉమ్మడి తూర్పు గోదావరి తరపున సపక్ తక్రా క్రీడలో సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ తెలిపారు. పతకాలు, షీల్డ్‌లను ఇద్దరి విద్యార్థులు విజయవాడలో ఆదివారం రాత్రి అందుకున్నారని చెప్పారు. ఈ ఇద్దరిని డీఈవో డాక్టర్ ఎస్‌కే సలీమ్ బాషా, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, స్థానిక కౌన్సిలర్ తిక్కా సత్య లక్ష్మి, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వానపల్లి ముక్కోటి రాంబాబు అభినందించారు.

### గోగన్నమఠం వాసికి ముంబయి జట్టులో చోటు



సత్యనారాయణరాజు

మామిడికుదురు: ముంబయి ఇండియన్స్ జట్టులో స్థానం పొందిన ఫాస్ట్ బౌలర్ పీవీ సత్యనారాయణరాజు గోగన్నమఠం గ్రామానికి చెందినవాడు. అతను ఇక్కడే పుట్టాడు. ప్రాథమిక విద్యాభ్యాసం అంతా ఇక్కడే జరిగింది. ఐపీఎల్ మెగా వేలంలో మేటి జట్టు అయిన ముంబయి ఇండియన్స్ రూ.30 లక్షలకు ఇతన్ని దక్కించుకుంది. ముంబయి ఇండియన్స్ జట్టుకు సత్యనారాయణరాజు ఎంపిక కావడంతో అతని స్వస్థలం గోగన్నమఠంలో మంగళవారం స్నేహితులు, బంధువులు సంబరాలు చేసుకున్నారు. మా వాడికి ముంబయి జట్టులో చోటు దక్కిందంటూ ఆనందం పంచుకున్నారు. సత్యనారాయణరాజు తండ్రి రమేష్ రాజు కొన్నేళ్ల క్రితం కాకినాడ వెళ్లి అక్కడ స్థిర పడ్డారు. ఆయనకు ఇద్దరు కొడుకులు కాగా పెద్ద కొడుకు సత్యనారాయణరాజు ఫాస్ట్ బౌలర్‌గాను, చిన్న కొడుకు పాండురంగారావు బ్యాట్స్‌మెన్‌గాను క్రికెట్‌లో రాణిస్తున్నారు. ఇప్పుడు పెద్ద కొడుకు ఐపీఎల్‌కు ఎంపిక కావడం స్థానికులను ఆనందంలో ముంచెత్తింది.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మలికిపురం: మండలంలోని శంకరగుప్తం గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేశనపల్లి గ్రామానికి చెందిన కల్వకొలను వెంకటలక్ష్మి(55) అనే మహిళ మృతి చెందినట్టు ఎస్సై పి.వి.వి.ఎస్.సురేష్ తెలిపారు. భర్త ఏసుబాబుతో కలిసి అంతర్వేది పుణ్యస్నానాలకు వెళ్లిన వెంకట లక్ష్మి మోటార్ సైకిల్‌పై తిరిగి కేశనపల్లి వెళ్తుండగా శంకరగుప్తంలో ముందు వెళ్తున్న మోటార్ బైక్ సిగ్నల్ ఇవ్వకుండా హఠాత్తుగా టర్న్ తీసుకోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడిన వెంకటలక్ష్మిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఆయన వివరించారు.

# ధాన్యం ఇలా భద్రపరచుకోవాలి..



తేమ శాతం తగ్గించేందుకు ఆరబెట్టిన ధాన్యం



కాకినాడ సిటీ: ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంటికి వచ్చిన ధాన్యాన్ని ఎలా భద్రపరుచుకోవాలో తెలియక రైతులు తికమకపడుతుంటారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని భద్రపరుచుకోవడం రైతులకు సవాల్ లాంటిది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పండించిన పంటలో 10 నుంచి 20 శాతం నష్టపోయే ప్రమాదం ఉందంటున్నారు వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎన్.విజయకుమార్. ధాన్యం నిల్వ చేసుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు వివరించారు. ధాన్యం నూర్చిన తరువాత ఇంటి అవసరాలు, విత్తనాలకు కలిపి సుమారు ఏడాదికి పైగా భద్రపరచాల్సి ఉంటుంది. దీంతో ధాన్యం రంగు, రుచి తగ్గుతుంది. సాధారణంగా వరి కోతల సమయంలో ధాన్యం 20 శాతం తేమ ఉంటుంది. కోసిన తరువాత వరి పనలను ఆరబెట్టడం వల్ల 4 నుంచి 6 శాతం తేమ తగ్గవచ్చు. ధాన్యంలో 14 శాతానికి మించి తేమ ఉంటే బూజు పట్టే అవకాశాలు ఉంటాయి. నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి నష్టం కలుగజేస్తాయి. అంతేకాక ఎలుకలు ధాన్యాన్ని తినడమే కాక, వాటి విసర్జనలతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది. నిల్వ ఉంచిన ధాన్యాన్ని నష్టపరిచే కీటకాల బెడద కూడా ఎక్కువే..

**ముక్క పురుగు**

పంట కోయడానికి ముందు నుంచే ముక్కు పురుగు నష్టం కలిగిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసి వేస్తుంది. ప్రౌఢ దశలోని ముక్క పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.



ఎస్.విజయకుమార్, జిల్లా వ్యవసాయాధికారి, కాకినాడ

**వడ్ల చిలుక**

ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే ధాన్యం చెడు వాసన వస్తుంది. తల్లి కీటకాలు వడ్ల గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడతాయి. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకుని పోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరక ముందే పై పొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తరువాత ఆ రంధ్రం ద్వారా వడ్ల చిలుక బయటికి వస్తుంది. ఇది వడ్ల మూటలు, గిడ్డంగులలో కనిపిస్తుంది.

**నుసి పురుగు**

దీనినే పుచ్చ పురుగు లేదా పెంకు పురుగు అంటారు. ఇది గొట్టపు ఆకారంలో చాలా చిన్నదిగా 3 మిల్లీమీటర్ల పొడవు ఉంటుంది. ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది. ఇది ప్రారంభ దశల్లో చెత్తను, ఆ తరువాత గింజపై పొరను, ఆ తర్వాత లోపలి బియ్యపు గింజను తిని తీవ్ర నష్టం కలిగిస్తుంది.

**ఎలుకల నివారణకు చర్యలు**

ధాన్యం గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా రోజూ శుభ్రం చేస్తుండాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింద భాగాలకు జింక్ రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్‌మెస్ మూతలు అమర్చాలి.

**ధాన్యం నిల్వ చేసే పద్ధతి**

రైతుల తక్కువ ధాన్యం నిల్వ చేసుకోవాలంటే వెదురు, సిమెంటు, లోహపు గాదెలను వినియోగించుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాంలు లేదా గిడ్డంగులను సిమెంటు కాంక్రీటుతో నిర్మించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. ముఖ్యంగా కీటకాలు, తేమ, వర్షపు నీరు లోనికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజు ముక్కలు, సిమెంటుతో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వకు కొత్త గోనె సంచులు ఉపయోగించాలి. గోనె సంచులపై, లోపలి మలాథియాన్ లేదా ఎండోసల్ఫాన్ ద్రావణం స్ప్రే చేయాలి. తర్వాత రోజు సంచులను ఎండలో ఆరబెట్టాలి.

### అనర్హులకు ఎందుకు ఉద్యోగాలు ఇచ్చినట్టు?

**జీజీహెచ్ మేనేజర్‌కు కలెక్టర్ మెమో**

కాకినాడ క్రైం: అనర్హులకు ఎందుకు ఉద్యోగాలు ఇచ్చినట్టు..? అర్హుల భవితను ఎందుకు చిదిమేశారు..? నాన్ లోకల్ వారికి ఎందుకు ప్రయోజనం చేకూర్చారు...? పెన్సిల్ రాతలతో ఎందుకు రికార్డులు మార్చేశారు...? రోస్టర్ ఎందుకు అవలంబించలేదు..? ఇవీ... కలెక్టర్ షణ్మోహన్ నర్సింగ్ పోస్టుల విక్రయాలకు పాల్పడిన జీజీహెచ్ మేనేజర్ నరసింగరావుపై సంధించిన ప్రశ్నలు. నర్సింగ్ పోస్టుల విక్రయాల బాగోతంపై కలెక్టర్, డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ చైర్మన్ షణ్మోహన్ కాకినాడ జీజీహెచ్ మేనేజర్ నరసింగరావుకు మెమో జారీ చేశారు. అవినీతి జరిగిందనే ప్రాథమిక నిర్ధారణలను ప్రస్తావిస్తూ చోటు చేసుకున్న అవకతవకలను మెమోలో ప్రస్తావించారు. నియామకాల్లో ఇంతటి అవినీతికి పాల్పడితే ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్‌ను వివరణ కోరగా నరసింగరావుపై నర్సింగ్ పోస్టుల విక్రయాల అంశంపై చేపట్టిన విచారణ ఆధారంగా మెమో జారీ చేసినట్లు తెలిపారు. శాంక్షన్ పోస్టుల్లో అవినీతికి పాల్పడ్డాడన్న ఆరోపణలకు సంబంధించి విచారణకు, ప్రస్తుత మెమోకు సంబంధం లేదన్నారు. అతని వివరణ అనంతరం తుది చర్యల కోసం విచారణ అంశాలను రాష్ట్ర స్థాయి సంబంధిత విభాగానికి నివేదిస్తామని తెలిపారు.

# వైభవంగా కార్తిక దీపారాధన



కార్తిక దీపారాధన మహోత్సవం ప్రారంభించిన మంత్రి సుభాష్



ఉష్ట్ర వాహనంపై స్వామి నగరోత్సవం ప్రారంభించిన పిల్లి సూర్యప్రకాశ్



అఖండ దీపారాధన ప్రారంభించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



సామూహిక లక్ష తులసి పూజలో పాల్గొన్న భక్తులు

రామచంద్రపురం రూరల్: ఏటా కార్తిక మాసం చివరి మంగళవారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించే కార్తిక దీపారాధన మహోత్సవాలు 61వ సంవత్సరం వైభవంగా నిర్వహించారు. ఉదయం జుత్తిక చిన్న బ్రహ్మత్వంలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకుని విశేష లక్ష తులసి పూజ ప్రారంభించారు.

మధ్యాహ్నం రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవాన్ని ప్రారంభించగా గ్రామంలో స్వామివారి నగరోత్సవం కన్నుల పండువగా జరిగింది. ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అఖండ జ్యోతి వెలిగించారు. శుభమ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి ఆహూతులను ఉర్రూతలూగించింది.దవులూరి శ్రీను ఆధ్వర్యంలో కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా మందు కాలుపులతో చిన్నారులు కేరింతలు కొట్టారు. అర్ధరాత్రి ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం నాటకం ఆకట్టుకుంది.

### నిజాయితీ చాటుకున్న విద్యార్థులు



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న హెచ్ఎం హరనాథ్

మామిడికుదురు: పెదపట్నంలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు తమ నిజాయితీని చాటుకున్నారు. రేకపల్లి బాబికి చెందిన రూ.1.30 లక్షలు విలువైన బ్రాస్లెట్ ఇటీవల పడిపోయింది. అది అదే గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థులు మల్లాడి హర్షశ్రీసాయివినయ్, పొన్నమండ ఆనంద్‌కు దొరికింది. వారు తమకు దొరికిన బ్రాస్లెట్‌ను బాధితుడు బాబికి అందజేశారు. నిజాయితీగా బ్రాస్లెట్ తీసుకువచ్చి ఇచ్చిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హరనాథ్ ద్వారా అందించారు. ఇద్దరు విద్యార్థులను హెచ్ఎం హరనాథ్‌తో పాటు సర్పంచ్ సుందరనీడి చిన్ని, సాయిబాబా ఆలయ కమిటీ ప్రతినిధి యేడిద రఘు, సలాది దొరబాబు అభినందించారు.

# పుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడుకోవాలి

**శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి**



ప్రసంగిస్తున్న భారతీ మహాస్వామి. చిత్రంలో ఎమ్మెల్యే, ఆలయ ఏసీ, రాజా బహదూర్

సఖినేటిపల్లి: భగవంతుడు కొలువై ఉన్న అంతర్వేది పుణ్యక్షేత్ర పవిత్రతను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని శృంగేరి పీఠాధిపతి విధు శేఖర భారతీ మహాస్వామి భక్తులకు హితవు పలికారు. మంగళవారం అంతర్వేది క్షేత్రంలో లక్ష్మీనృసింహుని దర్శనానికి విచ్చేసిన భారతీ మహాస్వామికి అర్చకులు, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. లక్ష్మీనృసింహస్వామికి విశేష అర్చన, ఉపాలయంలోని రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులను ఉద్దేశించి భారతీ మహాస్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. దివ్య క్షేత్రంలో భగవంతుడికి సేవ చేసుకోవడం ఎంతో పుణ్యప్రదమైందన్నారు. భగవంతుడి పట్ల శ్రద్ధాభక్తి, విశ్వాసం ఉంచాలన్నారు. భగవత్సంకల్పం ఉంటే ఎంత కష్టమైన పనైనా సులభంగా జరుగుతుందన్నారు. లక్ష్మీనృసింహుని దివ్యానుగ్రహంతో పుణ్యక్షేత్రంలో అభివృద్ధి పనులు దిగ్విజయంగా జరగాలని ఆకాంక్షించారు. సనాతన ధర్మం ఎపుడూ దృఢంగా ఉండాలి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేదిక వద్ద ఏటా నృసింహ జయంతి రోజున స్వామివారి పూజా కార్యక్రమాలు నిమిత్తం శృంగేరి పీఠం తరఫున శాశ్వత విరాళంగా రూ.లక్షా 11 వేల 116 నగదును దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు మహాస్వామి అందజేశారు. వేదిక వద్ద రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజా బహద్దూర్, మహాస్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు, ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జీ పెదకాపు, ప్రజాప్రతినిధులు బైరా నాగరాజు, కొండా జాన్‌బాబు, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దారు సీహెచ్ భాస్కర్ పాల్గొన్నారు. తొలుత అంతర్వేది బీచ్‌లో భారతీ మహా స్వామి పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం నీలకంఠేశ్వరస్వామివారి ఆలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకం చేశారు. ఆలయంలోని పార్వతీదేవి అమ్మవారిని మహాస్వామి దర్శించుకున్నారు. కాగా స్వామీజీ మంగళవారం సాయంత్రం వానపల్లిలో పర్యటించారు. రాత్రికి రాజమహేంద్రవరం చేరుకున్న ఆయనకు భక్తులు ఘన స్వాగతం పలికారు. శోభాయాత్ర నిర్వహించారు.

### ధాన్యం లారీ బోల్తా

దేవరపల్లి: యర్నగూడెం నుంచి పల్లంట్ల వెళ్లే రోడ్డు మంగళవారం ధాన్యం లారీ బోల్తాపడింది. ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ రోడ్డులో ఎక్కువగా వ్యవసాయ భూములు ఉన్నాయి. యర్నగూడెం, ధుమంతునిగూడెం, రామన్నపాలెం, కృష్ణంపాలెం గ్రామాలకు చెందిన రైతులు తమ పొలాల్లో పండిన పంటలను ఇళ్లకు తీసుకురావడానికి ఈ రోడ్డునే వినియోగిస్తారు. అయితే మార్గం సరిగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. రోడ్డులోని అమ్మవారి ఆలయం వద్ద గల కల్వర్టు పూర్తిగా శిథిలం కావడంతో గొయ్యి ఏర్పడింది. ప్రస్తుతం ధాన్యం రవాణా జరుగుతున్నందున లారీలు, ట్రాక్టర్లు గోతిలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. కృష్ణంపాలెంకు చెందిన రైతు సత్తి సాయి ఈశ్వరరెడ్డికి చెందిన పొలం నుంచి ధాన్యం బస్తాల లోడుతో వస్తున్న లారీ కల్వర్టు వద్ద గోతిలో పడి బోల్తాపడింది. రోడ్డుకు మరమ్మతులు చేసి, కల్వర్టు నిర్మించాలని ఆ ప్రాంత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# రైతులు అప్రమత్తం కావాలి

అమలాపురం రూరల్: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మూలంగా ఈ నెల 29, 30, డిసెంబర్ 1,2, తేదీలలో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున కోనసీమ వరి రైతులు తమ పంటలను కాపాడుకునేలా అప్రమత్తం కావాలని జాయింట్ కలెక్టర్ టీ. నిశాంతి మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం నిలబడి ఉన్న వరి పంట కోతలు కోయరాదని సూచించారు. కోతలు కోసి పనలు మీద ఉన్న ధాన్యాన్ని ఉప్పు ద్రావణంతో పిచికారీ చేస్తూ మొలకలు రాకుండా, రంగు మారకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఇప్పటికే నూర్చిన ధాన్యాన్ని వెంటనే తమకు నచ్చిన మిల్లులకు తరలించి విక్రయించుకునేలా పౌర సరఫరాల శాఖ పూర్తి సహకారాలు అందిస్తుందన్నారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని కూడా మిల్లులకు ట్యాగింగ్ చేస్తామని వెంటనే మిల్లులకు తరలించాలని ఆమె సూచించారు. రైస్ మిల్లుల వద్ద నియమించిన కస్టోడియల్ అధికారులు గోనె సంచులు, హమాలీలు, రవాణా వసతులను కల్పిస్తారన్నారు. జిల్లాస్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా పౌరసరఫరాల మేనేజర్, జిల్లా పౌరసరఫరాల అధికారి అందుబాటులో ఉండి రైతులకు సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. అల్లవరం, అమలాపురం, ఐ.పోలవరం మండలంలో వరి సాగు తక్కువగా ఉందని ఆమె స్పష్టం చేశారు.

### ఆరుగురు బెల్ట్ షాపుల నిర్వాహకుల బైండోవర్

అమలాపురం రూరల్: అమలాపురం మండలంలో, ఉప్పులగుప్తంలో అనధికారికంగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఆరుగురి వ్యక్తులపై ఎక్సైజ్ అధికారులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. అమలాపురం, ఉప్పలగుప్తం మండల తహసీల్దార్లు కిషోర్ బాబు, దివాకర్ ఎదుట హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ష్యూరిటీ విధించారని ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. బీఎన్ఎస్ఎస్ యాక్ట్ ప్రకారం ఆరుగురు నిందితులను బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**'1930'కు కాల్ చేసి ఫిర్యాదు చేయండి**



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. అమలాపురం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి ఆధ్వర్యంలో తమ బ్యాంక్ ఖాతాదారులతో స్థానిక యెండూరి కన్వెన్షన్ హాలులో సైబర్ నేరాలపై మంగళవారం రాత్రి జరిగిన అవగాహన సదస్సులో ఎస్పీ కృష్ణారావు మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరగాళ్లు అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీని అడ్డుగా పెట్టుకుని అనేక నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. సైబర్ నేరం జరిగిన తర్వాత రెండు గంటల గోల్డెన్ పిరియడ్‌లోపు సైబర్ విభాగానికి తక్షణమే ఫోన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆ విభాగం అందుబాటులో ఉంచిన '1930' టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు. ఆ తర్వాతే మీకు అందుబాటులో ఉన్న పోలీసు స్టేషన్‌ను లేదా పోలీస్ అధికారికి స్వయంగా కలిసి సైబర్ నేరం జరిగిన తీరు. పోగొట్టుకున్న అమౌంట్ తదితర వివరాలను అందించాలన్నారు. ఏ బ్యాంక్‌లో అకౌంట్ ఉందో ఆ బ్యాంక్ అధికారులకు తక్షణమే సమాచారం అందించాలని సూచించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ కృష్ణ ఆన్‌లైన్ ద్వారా సైబర్ విభాగానికి ఎలా ఫిర్యాదు చేయాలో వివరించారు. సదస్సులో అమలాపురం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ రమేష్, ఎస్‌బీఐ హెచ్ఆర్ మేనేజర్ మురళీకృష్ణ, పట్టణ సీఐ పి.వీరబాబుతో పాటు బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

### దాడి చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వ్యక్తిపై దాడి చేసి గాయపరచిన కేసులో నేరం నిరూపణ కావడంతో ముద్దాయికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.మూడు వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 5వ ఏజెఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తీర్పుచెప్పారు. 2021వ సంవత్సరం ఫిబ్రవరి 3న నమోదైన ఈ కేసు వివరాలు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. మున్సిపల్ కాలనీకి చెందిన తాళ్ల రాజు ఇంట్లో ఉన్న జామ చెట్టు విషయంలో తన పక్కింట్లో ఉంటున్న బూసి శామ్యూల్‌తో వాగ్వాదం అయింది. ఈ నేపథ్యంలో తాళ్ల రాజుపై బూసి శామ్యూల్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన రాజు ఆసుపత్రిలో చేరి చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి మూడో పట్టణ ఎస్సై కె.ప్రమీల కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీమోహన్‌రావు ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. నిందితుడు బూసి శ్యామ్యూల్ పై నేరం ఋజువు కావడంతో జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసు దర్యాప్తులో సాక్షులను సమగ్రంగా ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడడంలో ప్రతిభ కనబరిచిన అప్పటి 3 టౌన్ ఎస్సై కె. ప్రమీల ను, దర్యాప్తు పర్యవేక్షించిన ఇన్‌స్పెక్టర్ వి.అప్పారావును, కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎస్.వెంకటేశ్వరావును జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ అభినందించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంఖవరం: సీతంపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం వ్యక్తి మృతి చెందాడు. గ్రామంలోని జాతీయ రహదారిని ఆనుకొని ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒడిశాలోని రాయగడ్‌కు చెందిన జన సురేష్ కుమార్ (32) మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### డాక్టర్ శ్రీకాంత్‌కు బెయిల్ మంజూరు

అమలాపురం టౌన్: వలంటీర్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న డాక్టర్ పినిపే శ్రీకాంత్‌కు మంగళవారం బెయిల్ మంజూరైంది. ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న డాక్టర్ శ్రీకాంత్‌కు అమలాపురం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే డాక్టర్ శ్రీకాంత్ జైలు నుంచి బుధవారం విడుదలవుతారని తెలిసింది.